# ఎర్రదీపం

## యం.పినాకి

బావుంది, చల్లనివేళ బయలెల్లారు ఊరేగింపు.

- రోడ్డు కాలిపోతున్నది. ఎండలు మాడ్చేస్తున్నాయి -

అలా మూగుతారేం, నడవండి ఎందుకింత హడావిడి, ఎవరి కొంపలో తగలడిపోతున్నట్టు. పద పద.

ఓహో, శవం ఊరేగింపా. పెళ్లికీ, చావుకీ ఊరేగింపే. ఎంత జనం వెంట నడుస్తున్నారు. ఇలా, ఇంత బలగంతో చచ్చిపోవాలి. అవునూ, శోకాలు పెట్టే ఆడవాళ్లు లేరేం? పద, పద. కొంచెం పక్కకు తొలగవయ్యా స్వామి.

కుండ పట్టుకుని ముందరో మనిషి వుండడూ, ఏమిటి, వీళ్లు బాజాలు వుపయోగించనట్టుందే. వ్యవహారం కూడా కొంచెం పెద్దదిగానే కనబడుతున్నది. పాడెకు బదులు జీప్‌ను వుపయోగిస్తున్నారు. చుట్టూ అంతమంది. సరే, పద.

పద. ఏమిటీ హత్యా, ఆఁ, మత కలహాల్లో హత్యా! అందుకా రోడ్లిలా నిర్మానుష్యంగా వున్నాయి. పద, పద. కర్రలు.

అమ్మయ్యో, ఈ గడ్డంతో ఎలాదాక్కోవటం? పద. ఏదీ, కొంచెం చోటు. ముందర లూటీ.

ఔనౌను. ఇంకవన్నీ మామూలే. పరిగెత్తు. జనం వచ్చేస్తున్నారు.

ఊఁ! పరుగు.

కొట్లన్నీ మూసి వున్నాయి. జనం పరిగెత్తుతున్నారు.

ఈ ఉద్రిక్తత క్షణంలో ఎలా వ్యాపించింది. వాళ్ళ కళ్ళలో ఎంత తీవ్రత.

ఇదిగో, జనం వచ్చేస్తున్నారు. రాళ్లు రువ్వుతున్నారు. లాఠీలు. లాభం లేదు.

పరుగు! వచ్చేశారు. అయ్యో!

పరుగు పరుగు పరుగు పరుగు ప..... అబ్బా! బొటనవేలు పగిలింది. సరేలే. పరిగెత్తు.

పాపం, రిక్షా పచ్చడైంది. రిక్షా వాడితల చితుకుతోంది. పరుగు పరుగు. నీ తలా చితికి పచ్చడవుతుంది. పద.

బాబోయ్, ఎలా తప్పించుకోవటం. పరుగు పరుగు. గన్ కారేజీవంటి జీపు మీద శవం.

చుట్టూ గులాబి పూలు, కుంకం కళ్లు ఎర్రగా.

లాల్చీలు కుంకం కారి..... నెత్తురు. అబ్బా, కాలినొప్పి.

పరుగు పరుగు, పక్కసందులోకి.

గాడ్, ఇది సందుకాదు. ఇక్కడ సందు లేదు. పరుగు. పాపం, తోపుడుబళ్లు – అన్ని పళ్లు –

పోనీ, మీరైనా తినండి ..... ప్లాస్టిక్ సామాన్లు ..... ..... పగిలి ..... .... వాళ్లేమన్నారు. అమాయకులు .... అయ్యో, తల పగిలింది వాడికి, నీక్కూడా, పద పద.

అమ్మో, చచ్చాను దేముడోయ్. పద, పద.

ఒక్కరాయేకద, ఫరవాలేదు పరిగెత్తు. ఊఁ, పదా.

ఖూన్ కా ఖూన్ - నినాదాలు.

కిస్కా ఖూన్?

ఆ అరుపుల్లో ఎంత వుద్రేకం! నిన్ను ఛాలెంజి చేస్తున్నారు. వాళ్ళ కళ్ళలో బాధ, పగ, నిషా, భయం.

ఓపిక చచ్చిన వాళ్ళ మొహాల్లో అలసట, ఆకలి.

ఖౌన్ కా ఖూన్.

అమ్మో, చస్తే చస్తాను. ఇంక పరిగెత్తలేను....గౌస్!

అయ్యో, పాపం. గౌస్‌కు గాయాలు. ఇదిగో, గౌస్.

మొదట అతణ్ణి డాక్టరు వద్దకు తీసికెళ్ళండి.

గౌస్, ఎలా తగిలాయి గాయాలు?

అబ్బా, మంట. చచ్చాను.

మరేం భయంలేదు. సూపర్ ఫిషియల్ స్క్రాచెస్.

గౌస్, ఏమైంది?

ఊరేగింపు ..... ఏమిటీ?

గౌస్, ఇంటికెళ్ళిపో, ఇంక పనిచెయ్యలేవు. వెళ్ళి విశ్రాంతి తీసుకో.

నీ వొంట్లో బావుండలేదు, వెళ్ళిపో గౌస్.

వద్దు. ఒక్కణ్ణీ వెళ్ళలేను. ఈసారి చంపేసినా దిక్కులేదు.

ఔను, ఈ రాత్రెలా వుంటుందో?

రాత్రి అటువైపు యిళ్ళు తగలెట్టారట.

వాళ్ళూరుకుంటారా, ఈ రాత్రి వాళ్ళూ తగలెడతారు.

ఐనా, ఇదొక్కనాటి గొడవా, ప్రతీసారీ ఇంతే.

వాళ్ళే హత్య చేస్తారు. తెల్లారి ప్రతీకారంగా మరో హత్య.

కొన్ని యిళ్ళు కాలిపోతాయి. ఆస్తి నష్టం. ఛీ ఛీ వెధవ గొడవ.

సవాల్ చేసుకున్నవాళ్ళు పోట్లాడుకోవాలి గాని ఇలా జనాన్ని హింసిస్తే ఎలా?

గౌస్, పోనీ, ఇలా పడుకో!

ఫరవాలేదు, కూర్చుంటాను.

ఏమైంది. చెప్పు.

చెప్పేందుకేముంది, చూడాలి.

రాత్రికెలా మరి, ఎక్కడుంటావు? మీ యింట్లో ....

యింటికెళ్ళను. మావాళ్ళు లేరు. ఎక్కడో హోటల్లో వుంటాను.

హోటల్లో ఎందుకు, మా యింట్లో పడుకో. తోడుగా మా బాబాయి, మరో నలుగురు స్నేహితులు కూడా వస్తున్నారు.

పద -

జరగవలసిందంతా జరిగింతర్వాత ఫైరింజన్లు వచ్చాయి. ప్రేక్షకుల మీద బాష్ప వాయువు షెల్స్ పేలాయి. ఎవరో చచ్చినట్లుగా ఇళ్ళు బోసిగా వున్నాయి. మంటలారని కిరోసిన్ కొట్లు, కాలని శవాల్లా పొగపట్టిన కిరాణాకొట్టు.

అధికార్లు, అనధికార్లు, రాజకీయ నాయకులు వచ్చి చూసి మత సామరస్యం పెంపొందించుకుని దేశ సౌభాగ్యానికి, ఐకమత్యానికి తోడ్పడవలసిందని ఉద్బోధించి వెళ్ళారు. పత్రికేయులు జనాన్ని ప్రశ్నించారు. కాని వాళ్ళ జవాబులు 'ఉద్రేకాల్ని రెచ్చగొట్టేవిగా' వుండడంవల్ల అధికార వార్తలను మాత్రమే ప్రచురింప నిశ్చయించుకున్నారు.

ఫైరింజన్లు, ఫైరింజన్లు.

పగలంతా, రాత్రంతా వాటి చప్పుళ్ళే.

ఎక్కడర్రా తగలడుతున్నాయి ఎక్కడ? ఎక్కడ? ఎవరూ ఈ పన్లు చేస్తున్నారు, చేయిస్తున్నారు?

ఏ గడియారం అలారం మోగుతున్నది? ఎంతయింది, గంట? ఫైరింజను గంట.

ఈ రోజు నగరం పిచ్చాసుపత్రిలాగున్నది. లేవండి.

ఇక్కడో, అక్కడో యిళ్ళు తగలడుతున్నాయి, చూడండి.

ఆఁ, ఏమయిందవ్వా, రాత్రి?

రాత్రి మా వాడలో యిరవైమూడిళ్ళు కాల్చేశారు, బాబూ, ఇద్దరు పిల్లల్ని - చంటి పిల్లల్ని పొడిచి చంపారు.

ఒక్కణ్ణి నడిరోడ్డు మీద పొడిచారు .....

గట్టు దగ్గరున్న చాకలిదాన్ని .....

ఇంకా? ఇంకా ?

విన్న ఘోరాలు చాలవూ, ఇంకా ఏం కావాలి?

పరిస్థితి అదుపులో వుంది.

- ఉదయం వార్తలు.

స్వల్పంగా ఆస్తి నష్టం తప్ప చెప్పుకోదగ్గ సంఘటనలు మరేమీ లేవు.

- సాయంత్రం వార్తలు.

ఐదు ప్రాణాలు పోతే, ఓ ఆడకూతుర్ని మానభంగం చేసి చిత్రవధచేస్తే పందిళ్ళు తగలబెడితే ఇంకా పరిస్థితి అదుపులో వున్నట్టా?

హరహర మహదేవ!

అంతేనండీ, ప్రజల ఉద్రేకాలను రెచ్చగొట్టే విషయాలేవీ చెప్పరు, ముఖ్యంగా ఇలాంటి సమయాల్లో.

అలాకాదు. ఎవరు ఎంతమంది చచ్చారో, ఎవరి ఆస్తి ఎంత నష్టమయిందో నాకు స్పష్టంగా కావాలి. ఆఁ, అదీ నాక్కావలిసింది, తెలిసిందా!

ఆ లెక్కన వాళ్ళు నిజం పలకరు. వాళ్ళకు నిజం తెలియదని కాదు, తెలిసీ పలకరు. ఎందుకంటే ......

వాళ్ళ కధికారం కావాలి. జేబులు నిండాలి. మరో పది బంగాళాలు లేవాలి. వాళ్ళ విగ్రహాలు, పటాలు అన్ని ముఖ్య ప్రదేశాల్లో ఆవిష్కరింపబడాలి.

వీధులకు, సంస్థలకు వాళ్ళ పేర్లుండాలి. వాళ్ళను శ్లాఘిస్తూ రాసిన కావ్యాలకు అవార్డులు రావాలి, ఇంకా .....

ఊక దంపుడు ఉపన్యాసం యివ్వకు. అసలు విషయం చెప్పు. అందుకోసం నీ పార్టీకి ఓటు వెయ్యమంటావా, ఆఁ?

కాదు, అసలు లోపమంతా మనలోనే వుంది. మనలో ఐకమత్యం లేదు.

కారణం కులభేదాలు. అందువల్ల కులాలు నిర్మూలించండి.

మనుషులందరూ ఏకం కావాలంటే మతాలు నిర్మూలించాలి మరి.

నీకు మతమంటే గౌరవంలేదు.

ష్ ! ఆపండి కాసేపు గొడవ.

నాకు తెలుసునురా, దేశ విభజన రోజుల్లో ఎన్ని ఘోరాలు జరిగాయనుకున్నావు.....

ఔనుగానీ, మీవాళ్ళనెప్పుడు తీసుకొస్తున్నావు బాబాయి?

ఎలాగోయ్, ఈ పరిస్థితులు కొంచెం నిమ్మళిస్తే ..... ఐనా ఇది మొదటిసారి గనకా, ప్రతీ రెండు మూడేళ్ళకోసారి ఇంచుమించు యింతే.... ఎప్పుడీ విపత్తుల నించి విముక్తి దొరుకుతుందో....

ఒక్కటే పరిష్కారం, చెప్పనా, అసలు నలభై ఏడ లోనే తేలిపోవలసింది. ఇప్పటికైనా మించిపోలేదు.....

ఆపు. ఇంకాపు. నువ్వేం చెప్పొద్దు ఆపు.

సారీ, గౌస్. నీ మనస్సు నొప్పించానా, క్షమించవూ.

ఫరవాలేదోయ్. ఇలాంటి సమయాల్లో ఉద్రేకాలు సహజం.

ప్లీజ్, టేకిట్ ఈజీ.

అదేమిటి, మళ్ళీ గోల?

అంతా వట్టి షో! సమాన హక్కులూ లేవు, స్వాతంత్ర్యమూ లేదు.

మీరు కూడబలుక్కుని ఆడుతున్న నాటకం ఇది.

అంతా జరగనిచ్చి, తర్వాత,

అయ్యో బలహీనుడి కన్యాయం జరిగిందే అని నాలుగు కన్నీటి చుక్కలు రాల్చిపోతావుకదూ.

నేనసహాయుణ్ణే. నాకు క్షేమం లేదు. కాని ఈ అవమానాలవల్ల నాలో ఏం రగుల్కుంటోందో తెలుసా?

నీ మీద పగ. నేను నీతో పోట్లాడలేను. కాని నీ పాలలో విషం కలపగలను.

భాయీ, పిల్లిని గదిలో బంధించి హింసించకు.

ఎవరో పరిగెత్తుకొస్తున్నారు. గోల.

అదిగో కేక పన్నెండు దాటింది.

కిటికీ తియ్యకు లైట్ తీసెయ్.

మూలుగు, దూరంగా మూలుగు.

ఎలాగ, ఈ రాత్రి గడవటం?

మూలుగు చేరువవుతున్నది.

పరిగెత్తుకొచ్చిన ఆ దడ ఇంకా పోలేదు. వ్రేలు వాచింది. సలుపుతున్నది. బాధకు జ్వరం వస్తోన్నట్టుంది. ఆ టెన్షన్ ఇంకా పోలేదు.

మిగతా రోజుల్లో ఎంత స్నేహంగా వుంటేనేం.

ఇప్పుడు సునాయాసంగా చీలిపోగలరు.

క్షణంలో రక్తం వేడెక్కుతుంది.

రోడ్లు వాళ్ళకోసమే అన్నట్టుగా ఖాళీగా వుంటాయి.

ఈ నగరంలోని ఏ ప్రాంతం ఎక్కువ క్షేమకరం?

అలాకాదు. మనమంతా సోదరులం.

అవును ఎవరు కాదన్నారు. హం సబ్ కా ఖూన్ ఏక్‌హై. ఖూన్ కా ఖూన్.

చరిత్ర ప్రసిద్ధమైన చార్మినారు కట్టడమిది ....

అమ్మ బాబోయ్, అటువైపా.

నిజం, నిజం తప్ప మరేం పలుకకు. ఇది హైకోర్టు.

సరిసరి అటువైపు భస్తే వుండను.

ఇది మూసీ. దీనికి రెండువైపులా... మూలుగు!

ఎటువైపు?

నేలమీద ఎవరో పొర్లాడుతున్నారు. బలహీనంగా మూలుగుతున్నారు.

సత్తువ కోల్పోతున్నారు.

ఎవరు? ఎవరు?

ఔను. ఆడగొంతే.

నరాలమీద సన్నగా నొక్కులు.

అర్ధరాత్రి ఆడగొంతు, రోడ్డుపక్క సన్నగా మూలుగుతూ.

తూలుతూ వచ్చేస్తున్నది. మూలిగే సత్తువ కూడా లేనప్పుడు వెలువడే అతి సన్నని శబ్దాలు.

ఎవరో ఆమె?

పొద్దున్న జరిగినదానికి ప్రతీకారంగానేమో.

అవును. అదే. తృప్తిగా వుందిగదూ.

నో. తలుపు తియ్యొద్దు.

చూద్దాం ఏమిటో.

జాగ్రత్త ఏమైనా జరిగితే; రోజులు బాగోలేవు. ఇప్పటిదాకా గోల. ఎవరో ......

తలుపు సందులోంచి ఏం కనిపిస్తుంది, తీద్దాం. ఇటువైపే నడుస్తున్నారు. తియ్యకండి. ష్.

నా కాళ్ళు వణుకుతున్నాయి. మృత్యులయ.

తూలుతున్న నడక చప్పుడుకు మూలుగు.

తియ్యకు, తియ్యకు.

అమ్మో, తలుపుమీద చప్పుడు. ష్. ఎవరో బాదేరు?

ఊపిరి కూడా బిగపట్టిన నిశ్శబ్దం - భయంకరం.

తియ్యండి. తలుపు తియ్యండి.

వద్దు కొంచెంగా.

ఎవరూ? ఏం చేశారామెకు? ఎవరీ నగ్నసుందరి?

ఎర్రటి గుడ్డలా? కాదుకాదు. నెత్తురు, ఏదో వాసన. నరవాసన.

అయ్యో, ఆమె వక్షోజాలేవి?

ఎవరమ్మా, నిన్ను గాటు పెట్టారు?

నీ వునికి వాళ్ళ నెలా పురికొల్పింది?

ఎక్కడ గాయం చేశారో కూడా తెలియకుండా ఒళ్ళంతా నెత్తురు.

ఈ కర్ఫ్యూ రాత్రి అసలు నువ్వెలా బయటికి వచ్చావు?

ఏయ్, మనిషి లోపలకు తూలుతూంది. ఊఁ. జీపుమీద శవం. జనం కళ్ళు ఎర్రగా. రాళ్ళు, కర్రలు.

తోసెయ్యండి, దాన్ని.

అమ్మో, నేను ముట్టుకోను.

ప్చ్. ఇటు సోలిపోతున్నది తోసెయ్.

అబ్బ, పో.

పిచ్చా ఏమిటి, తోసెయ్యమంటే.

తోసెయ్. తోసెయ్.

పాపం.

పాపంలేదు. పుణ్యంలేదు. తోసెయ్.

భయంకరం. నేను ముట్టుకో.....

తోసెయ్. హమ్మయ్య.

నాకేడుపొస్తున్నది. భయమేస్తుంది. గుండెల్లో దడొస్తున్నది.

ఊఁ, గడియ పెట్టెయ్.

ఆ స్పర్శ ! మెత్తగా....

ఎవరు హంతకులు?

ఎవరది?

పిచ్చిది.

ఎవరూ?

చేతులు కడుక్కుని వచ్చి పడుకో. రెండు దాటింది.

ఎవరో?

ఏమో. ఐనా పిచ్చివాళ్ళకేం మతం.

ఒక సంఘటన

మురికినీళ్ళతో, మూసీనది, సోమరిగా, మగతగా, రోగిష్టిలా నెమ్మదిగా కదుల్తోంది. నడిరాత్రి దాటినా నీటిమీద గాలి ఇంకా వెచ్చగా, దుర్వాసనలతో మత్తుగా శ్వాసకోశాల్లో నిండుతోంది. ఒంటిగా నిర్మానుష్యంగా వున్న వంతెన కావలి వైపు పోలీస్‌స్టేషన్ దగ్గర ఖాళీట్రక్కు నిల్చింది. (దూరంగా కన్పిస్తున్న మంటల దగ్గరకు పోలీసులప్పుడు వెళ్ళారు)

ఎదురుగా తడికలతో కప్పబడిన పళ్ళ దుకాణం ఒకటి బిక్కు బిక్కు మంటూ కూర్చున్న అసహాయలా వుంది. అక్కడ అనూహ్యమూ, భయానకమూ ఐన వాతావరణం టైంబాంబులా వేచివుంది.

పోలీసులు నిష్క్రమించిన పదినిమిషాల్లో నలుగురు మనుషులు ముసుగుల్లో వచ్చారు. ఒకడు గీరిన అగ్గిపుల్ల పక్కవాడి చేతిలోని దివిటీని వెలిగించింది.

మరొకడు పెట్రోలు సీసా దుకాణం మీద కుమ్మరించిన క్షణాన దివిటీ పెట్రోలు మీద విసిరేసి పరిగెత్తారు.

మరో రెండు నిమిషాల తర్వాత ట్రక్కు కూడా మంటల్లో చిక్కుకున్న బౌద్ధ భిక్షువులా కన్పించింది.

నాలుగు ముసుగులూ వంతెన కింద గుడిశల్లో మాయమయ్యాయి.

మూసీనది కిక్కురుమనకుండా, రహస్యాలన్నిటినీ కడుపున దాచుకుని ఒదిగి ఒదిగి ప్రవహించింది.

'హారు' కథాసంకలనం, సెప్టెంబరు 1971.